బాన్సువాలో ముందస్తు సంబురాలు

బాన్సువాడలో చిన్నారికి కేక్ తినిపిస్తున్న నాయకులు

బాన్సువాడ, ఫిబ్రవరి 16: తెలంగాణ రాష్ట్ర సాధకుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను ఆదివారం బాన్సువాడలో ముందస్తుగా జరుపుకొన్నారు. స్థానిక ఇమ్మానియెల్ చర్చిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జుబేర్ స్థానిక క్రిస్టియన్లతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి బీఆర్ఎస్ అధినేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేడు నిర్వహించనున్న వృక్షార్చన పోస్టర్లను ఆవిష్కరించారు. పలువురికి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయి బాబా, రమేశ్ యాదవ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

వృక్షార్చన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కేసీఆర్ జన్మదిన వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు



- బాన్సువాడలో రక్తదాన శిబిరం
- పలు గ్రామాల్లో అన్నదానం
- దవాఖానల్లో రోగులకు పండ్లు పంపిణీ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- వృక్షార్చనకు పార్టీ శ్రేణుల సన్నద్ధం

బాన్సువాడ, ఫిబ్రవరి 16: తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించేందుకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అభిమానులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. బీర్మూర్ మండలంలోని తిమ్మాపూర్ తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉదయం తొమ్మిది గంటలకు ప్రత్యేక పూజలు, 9:40గంటలకు వృక్షార్చనలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం, పది గంటలకు నస్రుల్లాబాద్‌లో కేక్ కటింగ్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ నాయకుడు, బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ ఆదివారం తెలిపారు. ఉదయం పది గంటలకు నస్రుల్లాబాద్ మండలంలోని మైలారంలో అన్నదానం 11.30 గంటలకు నస్రుల్లాబాద్‌లో కేక్ కటింగ్, బాన్సువాడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ జన్మదినం జన్మదిన సంబురాలు, 12 గంటలకు ప్రభుత్వ ఏరియా వైద్యశాల, మాతా శిశు దవాఖానలో రోగులకు పండ్ల పంపిణీ, దవాఖాన ఆవరణలో మొక్కలు నాటడం, అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం, మధ్యాహ్నం రెండు గంటలకు హజ్రత్ నేక్ బీ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు షేక్ జుబేర్ తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు.

కామారెడ్డిలో..

కామారెడ్డి, ఫిబ్రవరి 16 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం సందర్భంగా కామారెడ్డిలోని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నివాసం వద్ద సోమవారం కేక్ కటింగ్, మొక్కలు నాటే కార్యక్రమాలను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి, ఫిబ్రవరి 16: మాచారెడ్డి మండలంలోని గజ్యా నాయక్ తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలో సోమవారం ఉదయం 11 గంటలకు కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పగడాల బాల్‌చంద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మాచారెడ్డి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 16: ఎల్లారెడ్డి పట్టణంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు జలంధర్‌రెడ్డి, ఆదిమూలం సతీశ్‌కుమార్ ఆదివారం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఫాంహౌస్ వద్ద సోమవారం ఉదయం 11.30 గంటలకు మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, అనంతరం ఫాంహౌస్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

మార్చి 2న కామారెడ్డిలో మారథాన్

కామారెడ్డి, ఫిబ్రవరి 16: కామారెడ్డిలో మార్చి 2వ తేదీన రాష్ట్ర స్థాయి మారథాన్ నిర్వహించనున్నట్లు పద్మపాణి సొసైటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చైల్డ్‌వుడ్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం నుంచి ఉదయం ఐదు గంటలకు 3కే కిడ్స్ రన్, 5కే, 10కే రన్ ఉంటాయని తెలిపారు. ఇందిరా గాంధీ స్టేడియం నుంచి రాజంపేట డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వరకు, అక్కడి నుంచి తిరిగి స్టేడియం వరకు 21 కిలో మీటర్లు పరుగు ఉంటుందని పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8520970785, 9160585578 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మేడ్చల్‌లో సోమార్‌పేట వాసి దారుణ హత్య

మాచారెడ్డి, ఫిబ్రవరి 16 : మండలంలోని సోమార్‌పేట గ్రామానికి చెందిన ఉమేశ్ (30) మేడ్చల్‌లో ఆదివారం దారుణ హత్యకు గురయ్యాడు. మాచారెడ్డి మండలంలోని సోమార్‌పేట గ్రామానికి చెందిన ఉమేశ్ మేడ్చల్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఉమేశ్‌ను ఆదివారం ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా గుర్తుతెలియని ఇద్దరు దుండగులు దాడి చేసి అతికిరాతకంగా కత్తితో పొడిచి చంపారు. అతడిని దగ్గరి బంధువులే హత్య చేయించారని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు.

బాధిత కుటుంబానికి అండగా యువత

బాధిత కుటుంబానికి నగదు, బియ్యం అందజేస్తున్న యువత

భిక్కనూరు, ఫిబ్రవరి 16: బాధిత కుటుంబానికి యువత అండగా నిలిచింది. మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన ప్రమోద్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. దీంతో గ్రామ యువత అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి పైల విక్రంరెడ్డి రూ.3 వేల ఆర్థిక సహాయం, కొప్పుల శ్రీకాంత్ 25 కిలోల బియ్యం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. వంశీరెడ్డి, పవన్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, సంకీర్త్ రెడ్డి, రిశాంక్‌రెడ్డి, నితీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత

పుస్తెమెట్టెలను అందజేస్తున్న బాల్‌చంద్రం

కామారెడ్డి, ఫిబ్రవరి 16: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన నందిని రాజుల వివాహం ఆదివారం జరిగింది. వధువుకు జిల్లా కేంద్రానికి చెందిన ఆయిత లలిత – బాల్‌చంద్రం దంపతులు పుస్తెమెట్టెలను అందజేశారు. 108 మంది పేద వధువులకు పుస్తెమెట్టెలు అందజేయనున్నట్లు బాల్‌చంద్రం తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్, వెంకటలక్ష్మి, కృష్ణమూర్తి, పాల్తి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాదిగల ఐక్యవేదిక మండల కమిటీ ఎన్నిక

ఉమ్మడి మాచారెడ్డి మండల మాదిగల ఐక్యవేదిక కమిటీ సభ్యులు వీరే..

మాచారెడ్డి, ఫిబ్రవరి 16: మాదిగల ఐక్య వేదిక ఉమ్మడి మాచారెడ్డి మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా పొదర్ల రాంచంద్రం, ప్రధాన కార్యదర్శిగా పొదర్ల సత్యం, గౌరవాధ్యక్షులుగా లక్ష్మీరాజ్యం, కాశీరాం, ఉపాధ్యక్షులుగా కోలపురం బాబు, బట్టు నరేశ్, సతీశ్‌బాబు, నాగరాజు ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారుగా బట్ట వెంకట్రాములు, కోశాధికారులుగా రమేశ్, దేవయ్య, కార్యదర్శులుగా విష్ణు, భూమేశ్, రాజెల్లం, ప్రవీణ్, కిషన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పుస్తెల తాడు అపహరణ

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 16: మండలంలోని మైలారం గ్రామ శివారులో ఉన్న కొచ్చెర మైసమ్మ ఆలయం నుంచి నస్రుల్లాబాద్ ప్రధాన రహదారికి వస్తున్న మహిళ మెడలో నుంచి పుస్తెల తాడు అపహరించుకుపోయిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. ఎస్సై లావణ్య తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామానికి చెందిన ఫిరంగి లక్ష్మి ఆలయం నుంచి నస్రుల్లాబాద్‌కు నడుచుకుంటూ వస్తున్నది. ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడు తెంపుకొని పారిపోయాడు. దానికి ఒక గ్రాము బంగారు పుస్తె ఉన్నదని బాధితురాలు లక్ష్మి తెలిపారు.

విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బహుమతులు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

బాన్సువాడ, ఫిబ్రవరి 16: విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ మోరియల్ శ్రీనివాస్‌రావు విద్యార్థులకు సూచించారు. బాన్సువాడలోని సాయికీర్తి జూనియర్ కాలేజీ ఆవరణలో ఆదివారం టీజీ సెట్ మోడల్ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలు చదువుకునేందుకు అనువైన వాతావరణం కల్పించాలని సూచించారు. అనంతరం మోడల్ టెస్టులో ప్రతిభ చూపిన విద్యార్థులు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంతోష్, రాజారాం, సాయిలు, పర్వయ్య, నాగరాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

దుర్కిలో చోరీ : నాలుగు తులాల బంగారం అపహరణ

దుండగులు ధ్వంసం చేసిన బీరువా

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 16: మండలంలోని దుర్కి గ్రామంలో చోరీ జరిగిందని ఎస్సై లావణ్య ఆదివారం తెలిపారు. గ్రామానికిచెందిన రేఖావర్ స్వరూప – రాజు దంపతులు ఈనెల 9వ తేదీన ఇంటికి తాళం వేసి ప్రయాగ్‌రాజ్ కుంభమేళకు వెళ్లారు. ఈనెల 15వ తేదీన ఇంటి పక్కనే ఉండే సౌమ్య చూడగా రాజు ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. విషయం తెలిసిన రాజు ఆదివారం ఇంటికి చేరుకొని గమనించగా.. ఇంట్లోని నాలుగు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి కామారెడ్డి క్లూస్ టీం చేరుకొని ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వాహనాల తనిఖీ : 20 మందికి జరిమానా

లింగంపేట, ఫిబ్రవరి16: మండలంలోని ముస్తాపూర్ తండా వద్ద పోలీసులు ఆదివారం మధ్యాహ్నం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలపై ఉన్న పెండింగ్ చాలన్లు పరిశీలించి వెంటనే చెల్లించాలని, లేకపోతే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న 20 మంది వాహనదారులకు జరిమానా విధించారు.

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి..

గాంధారి, ఫిబ్రవరి 16: రోడ్డుపై వాహనాలను నడిపేవారు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పకుండా పాటించాలని గాంధారి ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించినట్లు తెలిపారు. వాహనాలు నడిపేవారు సంబంధిత ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ నడిపే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఉన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

లింగంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 16: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరొక్కసారి చేపడుతున్న కుటుంబ సర్వేను అవసరమున్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో ప్రకాశ్ ఆదివారం ఒక ప్రకటనలో భాగంగా తెలిపారు. వివరాల నమోదు ఈనెల 28 వరకు కొనసాగుతుందన్నారు. కుటుంబ వివరాల నమోదుకు ఎంపీడీవో కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్ణీత ప్రొఫార్మాలో పూర్తి వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. లేదా టోల్ ఫ్రీ నెంబర్ 040-21111111కు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివరాలను తెలుపవచ్చన్నారు. అలాగే ప్రభుత్వ వెబ్‌సైట్ http://seeepcsurvey.cgg.gov.in నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తి వివరాలను నమోదు చేసి ప్రజాపాలన సేవా కేంద్రంలో అందించాలని పేర్కొన్నారు.

వివరాలు నమోదు చేసుకోవాలి..

లింగంపేట, ఫిబ్రవరి 16: గత నెలలో నిర్వహించిన సర్వేలో వివరాలు వెల్లడించని వారి రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో వివరాల నమోదు కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. గతంలో సర్వే నిర్వహించిన సమయంలో అందుబాటులో లేని వారు ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేను సద్వినియోగం చేసుకుని, వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో మల్లారీ, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 16: తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్ర మాదంలో ఒకరికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి పట్టణానికి చెందిన బెస్త రమేశ్ ఎల్లారెడ్డి పట్టణంలో చేపలు కొనుగోలు చేసి ఆటోలో కామారెడ్డికి తిరిగి వస్తుండగా ఎదురుగా కుక్క అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో రమేశ్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలిచామని పేర్కొన్నారు.

పాతది వదిలేశారు.. కొత్తది నిర్మిస్తున్నారు

● వృథాగా మారిన ఇందిరమ్మ ఇల్లు ● ప్రజాధనం వృథా చేస్తున్నారని ఆరోపిస్తున్న ప్రజలు

లింగంపేటలో గతంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇల్లు

నూతనంగా నిర్మించడానికి పనులు ప్రారంభించిన అధికారులు

లింగంపేట, ఫిబ్రవరి 16: పాత మోడల్ గృహాన్ని వదిలేసి నూతనంగా మరో మోడల్ గృహ నిర్మాణాన్ని చేపడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు మండల పరిషత్ కార్యాలయం వద్ద అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మోడల్ గృహ నిర్మాణం చేపట్టింది. ఇందిర మ్మ గృహాలు మంజూరైన లబ్ధిదారులు తమ గృహాలను ని ర్మించుకునే విధంగా మోడల్ హౌస్ నిర్మాణం చేశారు. అందులో కిచెన్, హాల్, బెడ్‌రూం, మరుగుదొడ్లు ఉండేలా రూపొందించారు. అనంతరం రాష్ట్ర విభజన కావడంతో తె లంగాణ రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూం గృహాల నిర్మాణానికి రూపకల్పన చేసింది. దీంతో పాత మోడల్ గృహాన్ని నిరుపయోగంగా వదిలేశారు. అందులో కొంతకాలం ఆధార్ కేంద్రం నిర్వహించగా.. ఇప్పుడు వృథాగా మారింది. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం.. నూ తన మోడల్ గృహ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు పాత మోడల్ గృహం పక్కనే ఐదు లక్షల రూపాయలతో నూతన గృహ నిర్మాణం చేపడుతున్నారు. దీంతో పాత గృహం పక్కనే నూతన గృహం నిర్మించడంతో పాత గృహం వృథాగా మిగిలిపోనుంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా నూతన గృహాలు నిర్మించడం వల్ల ప్రజాధనం వృథా చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు

గాయపడిన శ్రీనివాస్

బిచ్కుంద, ఫిబ్రవరి16: బిచ్కుంద మండలంలోని ఐటీఐ కాలేజీ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోపన్‌పల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ శ్రీనివాస్ భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై ఆదివారం పుల్కల్ గ్రామంలో శుభకార్యానికి వెళ్తున్నాడు. బిచ్కుందకు చెందిన అశోక్ బాన్సువాడ వైపు నుంచి బిచ్కుందకు వస్తున్నాడు. ఐటీఐ కాలేజీ సమీపంలోకి రాగానే ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిజామాబాద్ దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

ప్రమాదకరంగా బావి

● పట్టించుకునే వారేరీ..?

గాంధారిలోని వంతెన సమీపంలో ప్రమాదకరంగా ఉన్న పాడుబడిన బావి

గాంధారి, ఫిబ్రవరి 16: మండల కేంద్రంలోని వాగుపై ఉన్న వంతెన సమీపంలోని బావి ప్రమాదకరంగా మారింది. ఒకప్పుడు గ్రామస్తుందరికీ తాగునీటిని అందించిన ఆ బావి ప్రస్తుతం చెత్తాచెదారంతో నిండిపోయింది. కొందరు వ్యక్తులు ఈ బావిలో చెత్తాచెదారంతో పాటు చికెన్ వ్యర్థాలతో కూడిన సంచులను పారవేస్తున్నారు. దీంతో రోడ్డు వెంట ప్రయాణించేవారికి దుర్వాసన వస్తున్నది. కొన్ని నెలల క్రితం ఓ మహిళను హత్యచేసి, ప్లాస్టిక్ సంచిలో కట్టి బావిలో పడేసిన ఘటన కూడా వెలుగు చూసింది. నెలల తరబడి మహిళ మృతదేహం బావిలో ఉండడంతో దుర్వాసన వచ్చినప్పటికీ, చికెన్ వ్యర్థాల నుంచి వస్తున్న వాసనే అనుకొని ఎవరూ గుర్తించలేదు. పాడుపడిన బావి వంతెన పక్కనే ఉండడంతోపాటు అది లోతుగా ఉండడం, చెత్తాచెదారం ఉండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు లేదా గ్రామాభివృద్ధి కమిటీ వారు స్పందించి ప్రమాదకరంగా మారిన బావిని పూడ్చివేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల తనిఖీ

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి సలాం

నిజాంసాగర్, ఫిబ్రవరి 16 : మండలంలోని అచ్చంపేట ఆదర్శ పాఠశాలలో కొనసాగుతున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలను ఆదివారం జిల్లా నోడల్ అధికారి సలాం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి ప్రాక్టికల్ పరీక్షలకు ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయని తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయనవెంట ప్రిన్సిపాల్ కార్తీకసంధ్య తదితరులు ఉన్నారు.

అ 'పూర్వ' సమ్మేళనం

ఉపాధ్యాయులతో 1998-99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

రామారెడ్డి, ఫిబ్రవరి 16: మండలంలోని రెడ్డిపేట్‌లో 1998-99 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు గ్రామంలోని మున్నూరు కాపు సంఘంలో ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. అనంతరం ఒకరి యోగ క్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు వెంకట్‌గౌడ్, దత్తాద్రి, శంకరయ్యను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

లక్ష్మీపతి (ఫైల్)

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 16: తాడ్వాయి మండలంలోని దేమే గ్రామానికి చెందిన పురం లక్ష్మీపతి (38) ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో కొండల్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దేమే గ్రామానికి చెందిన లక్ష్మీపతి అదే గ్రామానికి చెందిన మంగళి రాజయ్య ఇంటి స్థలం విషయంలో గొడవ పడ్డారు. గొడవ పడుతున్న సందర్భంలో లక్ష్మీపతి గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

చంద్రమోహన్ (ఫైల్)

బిచ్కుంద, ఫిబ్రవరి16 : అప్పుల బాధతో మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జుక్కల్ మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకున్నది. జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. జుక్కల్ మండల కేంద్రానికి చెందిన బిజవార్ చంద్రమోహన్(34) కొంత కాలంగా ఆర్థిక పరిస్థితి బాగాలేక మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 13న బాగా మద్యం తాగి తన ఆర్థిక సమస్యలు ఎప్పుడు తీరుతాయో అని భార్యవద్ద బాధపడి, ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. రెండురోజుల నుంచి వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం ఉదయం గ్రామ శివారులోని బావి వద్ద గ్రామస్తులు చెప్పులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. కుటుంబ సభ్యులు చంద్రమోహన్‌విగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అనుమతి లేకుండా

ఇసుక అక్రమ రవాణా

మంజీరా పరివాహక ప్రాంతం నుంచి ఇసుకతో వెళుతున్న ట్రాక్టర్

నిజాంసాగర్, ఫిబ్రవరి 16 : మండల కేంద్రంలోని మంజీరా పరివాహక ప్రాంతం నుంచి కొన్ని రోజులుగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నది. రాత్రి అయ్యిందంటే చాలు కొందరు అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సెలవు రోజులు, రాత్రి సమయాల్లో ఎలాంటి అనుమతులు లేనప్పటికీ ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఇసుక రవాణా చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ భిక్షపతిని వివరణ కోరగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం తరలిస్తున్నారని తెలిపారు.